క్లుప్తంగా

ఆందోళన వద్దు..

పాలకొండ రూరల్: విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రస్తుతం వరి పంటకు వచ్చిన నష్టం ఏమీ ఉండదని, ఆందోళన అవసరం లేదని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి అన్నారు. వర్షాలు నిలిచిపోయిన నేపథ్యంలో పొలాల్లో నిలిచిన నీరు బయటకు వెళ్లే మార్గాలపై రైతులు దృష్టి పెట్టటం ద్వారా కొంత మేర సమస్య తగ్గుతుందన్నారు. మంగళవారం ఏడీ కార్యాలయంలో సిబ్బంది సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్ష ప్రభావంతో నీట మునిగిన పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్ర స్థాయిలో రైతులకు సూచనలు చేయాలని, వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ–క్రాప్ నమోదు తాజా పరిస్థితిపై ఏడీ వివరించారు. రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ చేయించుకోవాలని, తద్వారా కలిగే ప్రయోజనాలు గ్రామాల్లో వివరించాలని ఏడీ సూచించారు.

పెదరామ వంతెన పరిశీలన

సీతంపేట: మండలంలోని పెదరామ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ఎంపీడీఓ కె.గీతాంజలి మంగళవారం పరిశీలించారు. భారీ వాహనాలు ఈ బ్రిడ్జి మీదుగా రాకపోకలు లేకుండా చూడాలని గ్రామ సర్పంచ్‌తో పాటు సచివాలయ సిబ్బందికి సూచించారు. బ్రిడ్జి మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలని ఏఈ గౌరీశంకర్‌కు ఆదేశించారు.

పరామర్శ



జెడ్పీటీసీ కన్నతల్లితో పాటు పలువురుని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: మండలంలోని కత్తులకవిటి గ్రామానికి చెందిన పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన జెడ్పీటీసీ జంపు కన్నతల్లిని, ఇటీవల మృతి చెందిన రైతు వాసుదేవరావు కుటుంబాన్ని, గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గేదెల సుదర్శన్‌ను పరామర్శించి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఆమెతో పాటు ఎంపీటీసీ కొత్తవలస పరిమిళ, సర్పంచ్ సరోజనమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రౌతు రుషికేశవరావు, నల్లబిల్లి సుహాసిని తదితరులున్నారు.

గర్భిణులకు అన్నసమారాధన



భోజనం చేస్తున్న గర్భిణులు, వారి సహాయకులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి బాబా ఆలయంలో గర్భిణులకు మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీలో పీఎంఎస్‌ఎంఏ పథకం కింద తనిఖీలకు వచ్చిన గర్భిణులకు దూరభారం కావడంతో సకాలంలో ఇంటికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. దీని గమనించిన మండలంలోని బురద వెంకటాపురం గ్రామానికి చెందిన బొత్స శివున్నాయుడు, శ్రీహరిరావు దంపతులు దాతల సహకారంతో గర్భిణులకు భోజనాలు ఏర్పాటు చేశారు. వారిని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి కె.కె.సాగర్‌వర్మ అభినందించారు.

ఘనంగా వారాల పండగ



మొక్కులు చెల్లించుకుంటున్న గ్రామస్తులు

కొమరాడ: మండలంలోని రాజ్యలక్ష్మీపురం గ్రామంలో గ్రామదేవత ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు బాగుండాలని కోరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

విరాళాల సేకరణ

పాలకొండ రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీపీఐ నేతలు పట్టణంలో మంగళవారం విరాళాలు సేకరించారు. రూ.10వేల వరకు విరాళాలు సేకరించారు. సేకరణలో ఆ పార్టీ నాయకులు కూరంగి మన్మధరావు, బుడితి అప్పలనాయుడు, జి.సూరయ్య, పి.ప్రసాద్, కె.త్రినాథ్, మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అసమర్థత వల్లే..
వరద కష్టాలు



● మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: విజయవాడలో వరద కారణంగా జరిగిన ప్రాణ, ఆస్తి నష్టం చంద్రబాబు కూటమి ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి విమర్శించారు. జియ్యమ్మవలస మండలం చినమేరంగిలో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ.. సాధారణంగా ప్రకృతి వైపరీత్యాల సమయంలో వాతావరణం, నీటి పారుదల శాఖల నుంచి ప్రభుత్వానికి ముందుగానే రిపోర్టులు వస్తాయని, తదనుగుణంగా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కానీ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అటువంటి చర్యలు తీసుకోకపోవడం ఈ నష్టానికి దారితీసిందన్నారు. అధికారం చేపట్టింది మొదలు నేటి వరకూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, వైఎస్సార్‌సీపీ నాయకులపై అనేక ఆరోపణలు, విమర్శలు చేస్తూ పబ్లిసిటీ కోసం ఆరాటపడటమే గానీ, ప్రజల కోసం, రాష్ట్ర ప్రగతి కోసం ఈ ప్రభుత్వం ప్రయత్నించింది లేదన్నారు. ముంపు ప్రాంతాలలో పర్యటించిన సమయంలోనూ ఇదే యావతో సీఎం చంద్రబాబు వ్యవహరించడం శోచనీయమన్నారు. ముంపు ఏరియాలలోని అపార్ట్‌మెంట్లలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న వారిని ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించి ఉంటే ప్రమాద తీవ్రత ఇంతలా ఉండేది కాదన్నారు. విజనరీనంటూ.. పదే పదే చెప్పుకొనే చంద్రబాబు ఈ విషయంలో ముందుచూపు, ఆలోచనతో వ్యవహరించకపోవడం ప్రాణ నష్టానికి దారి తీసిందన్నారు. ముంపులో చిక్కుకున్న వారిలో 50 మందికి పైగా ప్రాణాలు కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నంలో మృత్యువాత పడటం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వారి మరణాలకు ఈ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉందన్నారు. వారం రోజులు దాటుతున్నా ప్రజలు ఇంకా ముంపు బాధలు పడుతున్నారంటే అది ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమేనన్నారు. రాష్ట్ర రాజధాని ప్రాంతంలోనే ఇటువంటి పరిస్థితులు సంభవించడం.. ప్రభుత్వ చర్యలు పబ్లిసిటీకే పరిమితమవ్వడం చూస్తుంటే.. కరోనా సమయంలో ఇదే చంద్రబాబు అధికారంలో ఉండి ఉంటే రాష్ట్రం శ్మశానాల కుప్పగా మారి ఉండేదని భయాందోళన వ్యక్తం చేశారు.

వెలుగు కార్యాలయంలో సౌకర్యాలు కల్పించాలి



ఎమ్మెల్యే జగదీశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న మండల సమాఖ్య సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: వెలుగు కార్యాలయంలో సౌకర్యాలు కల్పించాలని గుమ్మలక్ష్మీపురం మండల సమాఖ్య అధ్యక్షులు కె.చిలకమ్మ, ప్రధాన కార్యదర్శి ఎస్.ఊర్వశి, కోశాధికారి జి.శోభారాణి తదితరులు కోరారు. ఈ మేరకు మంగళవారం గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. వెలుగు కార్యాలయంలో వచ్చిపోయే డ్వాక్రా మహిళల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించాలని, కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు సీసీరోడ్డు నిర్మించాలని, రన్నింగ్ వాటర్‌తో పాటు తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

వరద బాధితుల కోసం రూ.20 వేలు విరాళం

విజయవాడలోని వరద బాధితులకు తనవంతు సాయంగా టీడీపీ అరకు పార్లమెంటు ఎస్టీ సెల్ కన్వీనర్ నందివాడ కృష్ణబాబు రూ.20 వేలు విరాళం అందించారు. గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని మంగళవారం కలిసి ఈ మొత్తాన్ని అందజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మండంగి భూషణరావు, కొండయ్య, గురాన శ్రీరామమూర్తి తదితరులున్నారు.

క్షణికావేశంలో నిర్ణయాలొద్దు..



మాట్లాడుతున్న వైద్య సిబ్బంది, ఉపన్యాసకులు

పాలకొండ రూరల్: సమస్యలు చుట్టుముడుతున్న క్రమంలో వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని నిలబడాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రేణుక అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మానసిక ఆరోగ్య సంస్థ, స్థానిక ఏరియా ఆస్పత్రి సిబ్బంది సంయుక్తంగా విద్యార్థుల్లో మనోస్థైర్యం నింపేలా పలు సూచనలు చేశారు. సామాజిక కార్యకర్త కె.కృష్ణారావు తదితరులు మాట్లాడుతూ టెలీమానస్ టోల్‌ఫ్రీ నంబర్ 14416 వినియోగంపై అవగాహన కల్పించారు. యువత ఆదర్శవంతమైన జీవన విధానం వైపుగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో వైద్యుల నిరసన



పాలకొండ రూరల్: నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన అన్నవరం పీహెచ్‌సీ వైద్యులు

వీరఘట్టం: ప్రభుత్వం అకస్మాత్తుగా జీఓ నంబర్ 85ను మార్చడం ద్వారా తమ వృత్తికి తీవ్ర అన్యాయం జరుగుతోందని స్థానిక వైద్యాధికారులు ఉమామహేశ్వరి, ప్రదీప్‌కుమార్ అన్నారు. జీఓ నంబర్ 85కు వ్యతిరేకంగా మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో 85 ద్వారా తమ మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోయిందని ఇలా అకస్మాత్తుగా జీఓలు మార్చడం తమ వృత్తికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

జీఓ 85ను రద్దు చేయాలి

పాలకొండ రూరల్: జీఓ నంబర్ 85 వల్ల వైద్య వృత్తికి తీవ్ర అన్యాయం జరుగుతోందని మండలంలోని ఎం.సింగుపురం, అన్నవరం పీహెచ్‌సీల వైద్యాధికారులు నిరసన తెలిపారు. సదరు జీఓను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ వారు నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన తెలిపారు. తక్షణమే ప్రభుత్వం ఈ జీఓను ఉపసంహరించుకోవాలని కోరారు.

కరకట్ట నిర్మించరూ..

కొమరాడ: మండలంలోని నాగవళి నది ముంపు ప్రాంతమైన కళ్లికోట గ్రామాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోకి వరదనీరు రాకుండా కరకట్ట నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. నాగావళి నది ప్రవాహం పెరిగితే సుమారు 30 ఎకరాల్లో పంటలు పూర్తిగా నష్టపోతున్నామని వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. సబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆమె వెంట నాయకలు శనపతి ఉదయ్‌శేఖర్ పాత్రుడు, అధికారులు ఉన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు



పాలకొండ రూరల్: ఇందిరానగర్ కాలనీలో మహా గణపతి మండపంలో సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు



వీరఘట్టం: కూరకుల వీధిలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా లక్షపత్రి పూజా కార్యక్రమంలో పాల్గొన్న దంపతులు

వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా మండపాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణలు కొత్త శోభను తెచ్చిపెడుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. - సాక్షి నెట్‌వర్క్



భామిని: ఘనసరలోని పొందరవీధిలో దీపాలతో గణపతి ఆకృతి

యోగాతో ఆరోగ్యం

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని యోగా శిక్షకుడు కె.జనార్దనరావు అన్నారు. స్థానిక యోగా కేంద్రంలో మంగళవారం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక యుగంలో ప్రతి మనిషి ఒత్తిడి గురై అనారోగ్యం పాలవుతున్నారన్నారు. యోగాతో దీన్ని అధిగమించవచ్చన్నారు. సూర్య నమస్కారాల ఆవశ్యకత, తద్వారా లభించే ఫలితాలు వివరించారు.

12న వైద్య శిబిరం

వీరఘట్టం: స్థానిక సత్యసాయి సేవా సమితిలో ఈ నెల 12న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సేవా సమితి కన్వీనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవజీవన్ తిరుపతి వారి ఆర్థిక సౌజన్యంతో బద్ధుమాసంగికి చెందిన ప్రగతి సేవా సొసైటీ వారి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. కంటి రోగులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విశాఖపట్టణానికి చెందిన శంకర్ ఫౌండేషన్ వైద్యులు వైద్య శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

విదేశాల్లో పనిచేసేందుకు అవకాశం

గుమ్మలక్ష్మీపురం: విదేశాల్లో పనిచేసేందుకు ఈనెల 12న విశాఖపట్నంలోని కంచరపాలెం ప్రభుత్వ ఓల్డ్ ఐటీఐలో అర్హులను ఎంపిక చేస్తారని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటర్ మెకానిక్, డీజిల్ మెకానిక్, ఆటో పెయింటర్ ట్రేడుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు ఆయా ట్రేడ్‌లలో అనుభవం కలిగిన అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. 150 మందికి విదేశాల్లో ఉద్యోగాలు కలిపించేందుకు అశోక్ లైలాండ్ కంపెనీ ముందుకొచ్చిందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

12న మండల స్థాయి స్కూల్ గేమ్స్

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 12న మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్. ఉమామహేశ్వరరావు అన్నారు. ఇందుకు సంబంధించి వ్యాయామ ఉపాధ్యాయులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. అండర్ 14 , అండర్ 18, విభాగాల్లో బాలబాలికలకు ఈ ఎంపిక ఉంటుందన్నారు. అన్ని పాఠశాలల నుంచి క్రీడాకారులు హాజరయ్యేలా చూడాలని ఆయన కోరారు. సమావేశంలో హెచ్‌ఎం సొంబర, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూ వేలం



గరుగుబిల్లి: గణపతి లడ్డూ వేలం వేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో రామాలయం వీధిలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి లడ్డూ వేలం వేశారు. గ్రామానికి చెందిన అక్కపోలు శివరామ్, శెట్టి భవానీ కుటుంబ సభ్యులు రూ.39,465లకు లడ్డూను దక్కించుకున్నారు. గత కొన్నేళ్లుగా వినాయకుని వద్ద ఏర్పాటు చేసిన లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు పోటీపడుతున్నారు. దీంతో ఏటా ధర పెరుగుతూ వస్తోందని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

అల్లువాడలో గణేశ్ నిమజ్జనోత్సవం

జియ్యమ్మవలస: మండలంలోని అల్లువాడ గ్రామంలో గణనాథుని నిమజ్జనోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కోలాటం, డప్పు వాయిద్యాలతో వినాయకుడిని గ్రామవీధుల్లో ఊరేగించారు. యువత నృత్యాలు చేస్తూ గణనాథున్ని గంట ఒడికి చేర్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్, సర్పంచ్ బొంగు పరిశినాయుడు, గ్రామ పెద్దలు లోలుగు నారాయణరావు, మహిళలు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: అల్లువాడలో వినాయకుని ఊరేగింపు

దసరా ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దసరా ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సూచించారు. అక్టోబర్ 3 నుంచి జరగనున్న అమ్మవారి దసరా ఉత్సవాల ఏర్పాట్లపై మంగళవారం ఆలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవడం ద్వారా 9 రోజుల పాటు ఉత్సవాలు విజయంతంగా పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం ప్రజల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు సూచించారు. సమావేశంలో ఈఓ మురళీకృష్ణ, ఎంపీపీ బి.భాను, సీఐ చంద్రమౌళి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నాగావళికి జలకళ



అన్నవరం - అంపిలి గ్రామాల మధ్య నిండుకుండలా దర్శనమిస్తున్న నాగావళి నది

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఇటీవల కురుసిన వర్షాలకు నాగావళి నది జలకళ సంతరించుకుంది. పాలకొండ పట్టణ, మండల పరిధిలో గెడ్డలు, వాగులు, చెరువుల్లో పుష్కలంగా వర్షపు నీరు చేరింది. ఇదిలా ఉంటే నిన్న మొన్నటి వరకు సాగునీటికి ఇబ్బందులు పడుతున్న శివారు ప్రాంతాల, లోతట్టు వరి భూముల్లో వర్షపు నీరు చేరటంతో పంట భూములు చెరువులను తలపించాయి. మండలంలోని గోయిదాపేట, చిన్న, పెద్ద మంగళాపురం, గోపాలపురం, అన్నవరం, అంపిలి గ్రామాలను అనుసరించి ప్రవహిస్తున్న నాగావళి నదిలో జలకల సంతరించుకుంది.

రక్తహీనత నివారణకు కృషి : పీడీ



న్యూట్రీ కిట్లు గర్భిణులకు అందజేస్తున్న పీడీ రాణి తదితరులు

సీతంపేట: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత నివారణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి పిలుపునిచ్చారు. మండలంలోని బూర్జగూడ అంగన్‌వాడీ కేంద్రం వద్ద మంగళవారం జరిగిన పోషణ్ అభియాన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. మంచి రుచికరమైన పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు తీసుకోవాలన్నారు. మాతా, శిశు మరణాలు అరికట్టాలన్నారు. ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పోషకాహార ప్రదర్శన చేశారు. గర్భిణులకు న్యూట్రీ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రాజ్యలక్ష్మి, సీడీపీఓ పి.రంగలక్ష్మి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని ఉద్దవోలు, చినగుడబ, వల్లరగుడబలో మంగళవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోన్‌లకు అపరిచితుల నుంచి వచ్చే లింక్‌లను ఓపెన్ చేయడం వల్ల మన వ్యక్తిగత డేటా సైబర్ నేరగాళ్లకు చేరుతుందన్నారు. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నాం.. మీ ఖాతాను అప్‌డేట్ చేయాలంటూ వచ్చిన ఫోన్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అటువంటి ఫోన్‌కాల్స్‌కు స్పందిస్తే మీ బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు మాయమవుందని తెలిపారు. గంజాయి రవాణా చేస్తే చట్ట పరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన



వంజరాపుగూడలో అంతరపంటలను పరిశీలిస్తున్న ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం షణ్ముఖరాజు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పి.ఆమిటి క్లస్టర్‌లో వంజరాపుగూడ, మండ, మొరమగూడ గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న వరి, చిరుధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు, దుంపజాతి పంటలను పార్వతీపురం మన్యం జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం పి.షణ్ముఖరాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను అభినందించారు. నీమాస్త్రం ఎరువుతో ప్రారంభ దశలో ఉన్న పంటలను పిచికారీ చేయడం వలన పంటను నాశనం చేసే తెగుళ్లు, పురుగుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. అలాగే దిగువ మండ గ్రామంలో జీడిమామిడి తోటల్లో సాగు చేసిన అంతరపంటలను పరిశీలించారు. సాగు విధానాలపై రైతులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలను అందివ్వాలని డీపీఎం సిబ్బందితో అన్నారు. ఆయన వెంట ఎంటీలు జి.నిర్మలాదేవి, గౌరి, ఎల్1 ప్రసాద్, ఎల్2 రవి కుమార్ తదితరులున్నారు.

33 శాతం నష్టం జరిగితే నమోదు



కంబర గ్రామంలో అరటి పంట పరిశీలిస్తున్న హెచ్ఓ

వీరఘట్టం: అరటి పంట నష్టం 33 శాతం ఉంటేనే నమోదు చేస్తామని ఉద్యానవన శాఖ హెచ్ఓ టి.అమరేశ్వరి అన్నారు. మండలంలోని కంబర, నడుకూరు, దశమంతుపురం గ్రామాల్లో తుపాను ప్రభావం వలన జరిగిన అరటి పంట నష్టాన్ని మంగళవారం పరిశీలించారు. సుమారు 7 ఎకరాలు పైబడి అరటి పంట నష్టపోవడంతో నడుకూరులో నమోదు చేశామన్నారు. దశమంతుపురంలో ఎటువంటి నష్టం వాటిల్లలేదన్నారు. కంబరలో పంట నష్టం అంచనా వేస్తున్నామని ఈ నెల 11నాటికి పూర్తవుతుందన్నారు.

భావోద్వేగాలను అదుపుచేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం:

మనో నిబ్బరం కలిగి భావోద్వేగాలను అదుపుచేసుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగడమే మానవ జీవిత సార్థకత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం అన్నారు. ప్రపంచ 'ఆత్మహత్యల నివారణ దినం' సందర్భంగా మంగళవారం స్థానిక కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. చెడు ఆలోచనలు, పనుల వలన చెడు ఫలితాలే వస్తాయన్నారు. ఆ సమయంలో భావోద్వేగాలు అదుపుచేసుకోలేక ఆత్మహత్యలవైపు మనస్సు మళ్లుతుందని, అలాంటి ప్రమాదకర పరిస్థితులు రాకూడదనుకుంటే విద్యార్థులు స్థిరమైన లక్ష్యాలు కలిగి ఆచరణాత్మక ప్రణాళిక ఏర్పాటు చేసుకొని ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వి.కల్పన ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆత్మహత్య అనివార్యమా..? ఎందుకు..? అంశంపై వ్యాసరచన పోటీలతో పాటు భావోద్రేకాలను అదుపు చేయడమెలా? అనే అంశంపై గ్రూపు డిస్కర్షన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీవాణి, స్వరూప ఉన్నారు.